క్లుప్తంగా

నియోజకవర్గంలో నేడు హనిమిరెడ్డి పర్యటన

అద్దంకి రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సోమవారం ఉదయం 10 గంటలనుంచి కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ సైదా కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు కొరిశపాడు మండలం కృష్ణంరాజు పాలెం గ్రామంలో పమిడిపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి పెద్దకర్మకు హాజరవుతారు. 2 గంటలకు సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామంలో ఇటీవల మాతృవియోగం పొందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పేరం కోటేశ్వరరావును పరామర్శిస్తారని తెలిపారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం భరణి నక్షత్రం చతుర్థశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ నియామకం



నూతన ఈఓ పోతిని శ్రీనివాసరావు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం పరిపాలనాధికారి (ఈవో)గా పి. శ్రీనివాసరావు నియామకమయ్యారు. దేవాదాయశాఖ కమిషన్ ఆదేశాల మేరకు ఈపురుపాలెం రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానానికి సంబంధించిన రికార్డులను నూతన ఈఓ పరిశీలించారు. నూతన ఈఓను దేవస్థానం అర్చకులు, కమిటీ ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

ఎన్‌సీసీ - ఏ గ్రేడ్ సర్టిఫికెట్‌తో సత్తా



ఎన్‌సీసీ అధికారి నుంచి మెమొంటో అందుకుంటున్న దివ్యశ్రీ

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సజ్జా దివ్యశ్రీ ఎన్‌సీసీలో ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించినట్లు ఎన్‌సీసీ అధికారి తోట వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. విద్యార్థిని పరీక్షల్లో 596 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచిందన్నారు. దీనితో పాటు 23 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ వారిచే ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించిందని తెలిపారు. దివ్యశ్రీకి మోమెంటో అందించి అభినందించారు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత విద్యలో ప్రవేశానికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడంతో ఉపయోగపడతాయన్నారు.

సమస్యల ‘స్టాండ్’

- ఇంకొల్లు బస్టాండులో ప్రయాణికుల అవస్థలు
- వర్షం కురిస్తే బస్టాండులో కూర్చోలేక బయటకు పరుగులు
- రేకుల షెడ్డు స్థానంలో శ్లాబు వేయాలని ప్రయాణికుల వినతి



ఇంకొల్లు బస్టాండులో రేకుల షెడ్డులో వేచి ఉన్న ప్రయాణికులు

ఇంకొల్లు(చినగంజాం): వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే ఇంకొల్లు బస్టాండు సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆవరణలో ఉన్న రేకుల షెడ్డులో ప్రయాణికులు వేచి ఉండలేక సతమతమవుతున్నారు. కాస్తంత వర్షం కురిసినా అసౌకర్యంగా ఉంటోంది. బస్టాండు ఆవరణ అంతా వాన నీటితో నిండిపోవడం, ప్రయాణికులు కూర్చొనే బల్లలు సైతం తడచిపోవడం, ప్రయాణికుల విలువైన వస్తువులతో పాటు వారు కూడా వానలో స్నానం చేయాల్సి రావడం దురదృష్టకరం. దీంతో వారంతా బస్టాండు పరిసరాల్లో ఉన్న దుకాణాల్లోకి వెళ్లి వర్షానికి తడవకుండా తల దాచుకోవాల్సి వస్తోంది. ఇంకొల్లు బస్టాండు పరిధిలో సుమారు 40 గ్రామాలకు చెందిన 5 వేల మందికి పైగా ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరేందుకు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడిన సందర్భాల్లో ప్రయాణికులకు ఈ బస్టాండు ఆవరణలో రక్షణ లేకుండా పోతోంది.

చీరాల డిపో పరిధిలో ఉండటంతో..

ఇంకొల్లు బస్టాండు ఆవరణలో నెలకొన్న సమస్యలను తక్షణమే తొలిగించే విషయమై అధికారులు సత్వరం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బస్టాండు చీరాల డిపో పరిధిలో ఉండటంతో పనులు జరిగేందుకు జాప్యం జరుగుతోందని, గుంటూరు డిపో పరిధిలోనికి మారిస్తే బస్టాండు అభివృద్ధితో పాటు డిపో నిర్మాణం కూడా జరిగిందేకు అవకాశాలు ఉంటాయని వారంటున్నారు. ఇంకొల్లులో ఆర్టీసీ డిపో నిర్మాణానికి గతంలో స్థలం కూడా కేటాయించారు. అయితే చీరాల పరిధిలో ఉన్న డిపోకు ఆర్థిక వనరులు తక్కువగా ఉన్నందున ఇంకొలు గురించి పట్టించుకొనే వారే కానరావడంలేదు.

> **సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లాం**
>
> ఇంకొల్లు బస్టాండు విషయమై నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డిపో నిర్మాణ విషయంలో జాప్యం జరుగుతుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రేకుల షెడ్డు సమస్యను బాపట్ల ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రవికాంత్, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుల దృష్టికి వాట్సప్ ద్వారా తీసుకెళ్లాం. బాపట్ల రీజనల్ మేనేజర్ రవి కాంత్ సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
>
> – అన్నంబొట్ల మోహనకృష్ణ, మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు

గంగమ్మా కాపాడమ్మా!



అలంకరణలో ఈర్ల గంగమ్మ



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బల్లికురవ: వ్యవసాయ పనుల సీజన్ ఆరంభం అయిన సందర్భంగా వైశాఖమాసం త్రయోదశి ఆదివారం సందర్భంగా బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మకు వివిధ గ్రామాల భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. బల్లికురవ ప్రాంతం నుంచి మే చివరి వారంలో వ్యవసాయ పనులకు కర్ణాటక ఆంధ్రాలోని కర్నూలు, తెలంగాణ, ఒడిస్సా ప్రాంతాలకు వలసలు వెళుతుంటారు. ఏప్రిల్ చివరి వారం నుంచి మే చివరి వారం వరకు సొంత గ్రామాలకు వచ్చి బంధుమిత్రులతో గడిపి తిరిగి వ్యవసాయ పనులకు 10 సంవత్సరాలుగా వలసలు వెళుతున్నారు. వెళ్లేటప్పుడు పాడి పంటలతో తమ కుటుంబాలను కాపాడాలంటూ ఈర్లగంగమ్మకు మొక్కులు చెల్లించుకుంటారు. బల్లికురవ, కొత్తపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి, కొప్పరపాలెం, సోమవరప్పాడు, మల్లాయపాలెం గ్రామాల్లోని భక్తులు అమ్మవారితోపాటు అక్కడే స్వయంభూగా వెలసిన సుబ్రమణ్యేశ్వరుడికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో భాగంగా అర్చకులు చల్లగుండ్ల శ్రీనివాసరావు ప్రత్యేకంగా అలంకరించారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక

అద్దంకి: కొరిశపాడు సమితి పంచాయతీరాజ్‌కు చెందిన నాలుగో తరగతి ఉద్యోగులు ఆదివారం తమ సంఘాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సమావేశం అద్దంకి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో సంఘ గౌరవ అధ్యక్షురాలిగా జె. పంగులూరు ఎంపీడపీవో కార్యాలయంలో పనిచేస్తున్న బి. పద్మావతి, ప్రెసిడెంట్‌గా బి. సుధీర్(జెడ్పీహెచ్‌ఎస్), వైస్ ప్రెసిడెంట్‌గా అద్దంకి ఎంపీడీవో కార్యాయంలో పనిచేస్తున్న డి. దేవరాజ్, సెక్రటరీగా ఓ. ఏడుకొండలు (అద్దంకి), జాయింట్ సెక్రటరీగా తిమ్మనపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆర్. సుప్రజ, ట్రెజరర్‌గా కొరిశపాడు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్. సందీప్, కో ఆప్షన్ మెంబర్‌గా అద్దంకి ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న టి. సంగీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా వై. పోలయ్య, అబ్జర్వర్‌గా ఈవీ శివప్రసాద్ వ్యవహరించారు. ఎన్నికైన కమిటీ పదవి కాలం మూడు సంవత్సరాల పాటు ఉంటుందని వెల్లడించారు.

హైస్కూల్ భూ ఆక్రమణపై చర్యలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం శేఖర్

వేటపాలెం: పందిళ్లపల్లి హైస్కూల్‌కి పూర్వం దాతల అందించిన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం బలిమి శేఖర్ అన్నారు. పందిళ్లపల్లి శివారులు రాజుగారి తోట వద్ద గల హైస్కూల్‌కు సంబంధించిన వ్యవసాయ భూమిని హెచ్‌ఎం ఎస్‌ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు ఆదివారం సందర్శించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ హైస్కూల్‌కు దాతలు సర్వే నెంబరు 204-4లో 3.69 సెంట్ల వ్యవసాయ భూమిని అందించారని తెలిపారు. అయితే ఆ భూమి నుంచి అక్రమంగా కొందరు ఇసుక తరలించుకోవడంతో పాటు, ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఆ భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించామని తెలిపారు. హద్దు రాళ్లు వేయగా.. ఆక్రమణ దారులు రాత్రికి రాత్రే వాటిని తొలగించారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, దోగుపర్తి జయకృష్ణ, మసనం విద్యాధర్, నంగు రామిరెడ్డి, పోలకం బాలాజీ కుమార్, రొండా దశథ రామిరెడ్డి, పాల్గొన్నారు.

బండ్ల రామారావు అవార్డు ప్రదానం

చీరాల: పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో సహజ సాహితీ ఆధ్వర్యంలో బండ్ల రామారావు అవార్డు ప్రదానం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ కవి కిషోర్ కుమార్‌కు బండ్ల రామారావు అవార్డుతో సత్కరించి సన్మానించారు. అలానే రచయిత్రి డి.మోహనశేఖర్ రచించిన సంపుటిని ఆవిష్కరించారు. విశ్రాంత శాస్త్రవేత్త అందె మురళీవరప్రసాద్, డాక్టర్ బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ, కృష్ణమోహన్, కట్టా వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్లలో తిరంగ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు, దేశభక్తి పరులు

మేదరమెట్ల: సిందూర్ ఆపరేషన్ విజయోత్సవం సందర్భంగా మోడీ ఆదేశానుసారం భారత సైన్యానికి మద్దతుగా ఆదివారం స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి మేదరమెట్ల బస్టాండ్ వరకు తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ ప్రాముఖ్యతను తెలుపుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఆడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. గంగమ్మ తల్లీ!



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: సాగుకు సమాయత్తమయ్యే ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం కారంచేడు ప్రాంత రైతులు ఆనవాయితీగా వస్తోంది. మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలోని పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు, రైతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రైతులు, మహిళలు ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. కొద్ది రోజుల్లో గ్రామంలోని అన్ని ప్రాంతాల నుంచి గంగమ్మకు, పోలేరమ్మలకు కొలుపులు కూడా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1వ తేదీన యజ్ఞశాలపేట యువకులు, రైతులు ఈ కొలుపుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ప్రతి ఆదివారం ఒక ప్రాంతానికి చెందిన భక్తులు ఈ ఏర్పాట్లు చేస్తారు. అనంతరం రైతులు సాగును ప్రారంభిస్తారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారికి సారెలు, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం ఎక్కువగా భక్తులు అమ్మవారికి పూజలు చేస్తుంటారు.

విద్యార్థుల అభివృద్ధి ధ్యేయం



విద్యార్థులకు ఇంగ్లీషు మెటీరియల్ అందజేస్తున్న సేవా సభ్యులు

చినగంజాం: భవిష్యత్‌లో విద్యార్థులకు సంబంధించిన అన్ని విద్యాకార్యక్రమాలను చేపడతామని సోపిరాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) సభ్యులు తెలియజేశారు. ఆదివారం సోపిరాల ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఇంగ్లీషు మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 రోజులుగా 6 నుంచి 10 వ తరగతి వరకు విద్యనభ్యసించే బాలబాలికలకు స్పోకెన్ ఇంగ్లీషు, బేసిక్ గ్రామర్‌లో వేసవి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తూ ఇంగ్లీషు బాష పట్ల ఆసక్తిని, నైపుణ్యాలను ఈ శిక్షణ తరగతుల్లో బాలబాలికల్లో పెంపొందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేసవి ఉచిత శిక్షణ తరగతులను పిల్లలు కూడా ఆసక్తిగా హాజరై సద్వినియోగం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పిల్లలందరికీ స్పోకెన్ ఇంగ్లీషు, బేసిక్ గ్రామర్ పుస్తకాలను సేవా సభ్యులు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో పిల్లలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను చేపడతామని సేవా ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆమంచి వెంకటేశ్వరరావు, నున్నా హరినాథ్, తుమ్మలపెంట శ్రీనివాసరావు, పర్వతరెడ్డి రంగనాథ్, పర్వతరెడ్డి వెంకటస్వామి, ఉలిచి చంద్రశేఖర్, సిద్ధం నాగమల్లేశ్వరరావు, దేశంశెట్టి సురేష్, పల్లపోలు శ్రీమన్నారాయణ, పల్లపోలు శ్రీనివాసరావు, శిఖరం వెంకటేశ్వరరావు, పోలకం వెంకయ్య, పోతురాజు తదితర సేవా కమిటీ ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్



రక్షణ కంచె లేకుండా ప్రమాదభరితంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ కింద భాగంలో దుకాణదారులు వేసిన చెత్తాచెదారం

చీరాల రూరల్: స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా జంజనం కాంప్లెక్స్ (అపార్ట్‌మెంట్) వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. నిత్యం జనసంచారంతో వాహనాల రద్దీతో బిజీగా ఉండే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడం ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు బయటకు వచ్చాయి. చేతికి అందే ఎత్తులో ఉన్న ఫ్యూజులకు ప్రమాదవశాత్తు ఎవరికైనా తగిలితే అంతే సంగతులు. అంతేకాక ట్రాన్స్‌ఫార్మర్ కిందభాగంలో కొందరు తోపుడు బండ్లపై పండ్ల వ్యాపారం, చిరు వ్యాపారుల సమీపంలోని దుకాణదారులు తమ దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలు చెత్తా చెదారాలను ఇక్కడ డంపింగ్ చేస్తున్నారు. రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగసిపడటంతో కింద ఉన్న చెత్తాచెదారాలకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. దుకాణదారులు స్పందించి విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో స్పందించిన విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలుపుదలచేసి ప్రమాదాన్ని నివారించారు. అంతేకాక అక్కడ నిలవవున్న చెత్తా చెదారాలను తొలగించేందుకు మున్సిపల్ కార్మికులు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు తగిలి షాక్ కొడుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. చెత్తా చెదారాలు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. చేతులు కాలాక ఆకులు పట్టుకునే చందంగా ఏదైనా ప్రమాదం సంభవించి స్పందించేకంటే ముందుగానే మేల్కొని జరిగే ప్రమాదాన్ని ముందుగానే నివారించాలని అంతా కోరుకుంటున్నారు.

పోలేరమ్మ తల్లికి మొక్కులు



ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారు

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లింపు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి వివిధ రకాల పూలు, నూతన చీరలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పొంగలి నైవేద్యాలుగా చెల్లించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఎంపీ వైవీని కలిసిన కోయి అంకారావు



ఎంపీ వైవీతో కోటిరెడ్డి, అంకారావు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన కోయి అంకారావును వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించిన సంగతి విదితమే. కాగా రాజ్యసభ సభ్యుడు వైవీసుబ్బారెడ్డిని అంకారావు, స్టేట్ బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ పులికం కోటిరెడ్డి ఆదివారం ఒంగోలులోని వైవీ స్వగృహంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డిని కూడా కలిశారు.

గోతుల మయం.. ప్రమాద భయం



గోతులమయంగా కొణిదెన - ఉప్పమాగులూరు రోడ్డు



తటాకాన్ని తలపిస్తున్న బల్లికురవ - మార్టూరు రోడ్డు



ఈర్లకొండ నుంచి వెళుతున్న గ్రానైట్ లారీ

బల్లికురవ: గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలతో మండలంలోని పలురోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రతి అడుగుకూ గోతులు ఏర్పడి తటాకాలను తలపిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈ గోతుల్లో నీరు చేరటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొణిదెన – గంగపాలెం – వేమవరం జంక్షన్ మీదుగా ఉప్పుమాగులూరు వెళ్లే రోడ్డు, బల్లికురవ – నాగరాజుపల్లి – మార్టూరు రోడ్డు, బల్లికురవ – కొణిదెన – మార్టూరు రోడ్డు గోతుల్లో ప్రయాణం సాగటం లేదు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి 50 నిషాల నుంచి 60 నిమిషాల సమయం పడుతోంది. పైగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిందే. బల్లికురవ ఈర్ల కొండ నుంచి గ్రానైట్, మీటరు, ముడిరాళ్ల ఈ రోడ్ల ద్వారానే సమీపంలోని పరిశ్రమలకు నిత్యం ఎగుమతులు జరగాలి. గోతుల్లో గ్రానైట్ లారీల కూరుకుని నిత్యం ట్రాఫిక్ జామ్‌లు తప్పటంలేదు. ఇప్పటికైనా ఇబ్బందులు తొలగించాలని ప్రజలు, వాహన చోదకులు వేడుకుంటున్నారు.